## ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

**తేది 17.05.2012** **సమయం 1815 గంటలు**

### ముఖ్యాంశాలు

1.రాష్ట్రంలో ఉప ఎన్నికలకు ఎన్నికల సంఘం రేపు నోటిఫికేషన్ జారీ చేస్తుంది.

2. ఉప ఎన్నికలల్లో అక్రమ నగదును నియంత్రించేందుకు మరింత మంది ఐటి అధికారులను రంగంలోకి దింపనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి బన్వర్‌లాల్ తెలిపారు.

3.సాక్షి వార్తా పత్రికకు ప్రభుత్వ ప్రకటనల జారీని నిలుపు చేస్తూ విడుదల చేసిన జిఓపై హైకోర్టు స్టే విధించింది.

4.రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాల్పులు మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది.

..............................................

వచ్చే నెలలో 18 అసెంబ్లీ స్థానాలు, ఒక లోక్‌సభ స్థానానికి రేపు ఉదయం 11 గంటలకు నోటిఫికేషన్ జారీ అవుతుంది.

నోటిఫికేషన్ జారీ కావటంతో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 25వ తేదీ తుది గడువు కాగా 28వ తేదీ ఉపసంహరణకు తుది గడువు.

ఇదిలా ఉండగా ఉప ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది.

ఉప ఎన్నికల నిర్వహణ సంసిద్ధతపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కె.భన్వర్‌లాల్ ఎన్నికలు జరగనున్న 12 జిల్లాల కలెక్టర్లు , ఎస్.పిలతో ఈ రోజు హైదరాబాదు నుండి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు.

...............................................................

ఉప ఎన్నికల సందర్భంగా భారీ స్థాయిలో అక్రమ నగదు పట్టుబడుతున్న నేపథ్యంలో మరి కొంత మంది ఐటి అదికారులను రంగంలోకి దింపనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి భన్వర్‌లాల్ చెప్పారు. ఇప్పటికే 12 మంది ఐటి అధికారులను నోడల్ అధికారులుగా నియమించామని, మరి కొంత మందిని నియమిస్తామని తెలిపారు. ఈ సాయంత్రం ఆయన సచివాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 14.5 కోట్ల రూపాయల అక్రమ నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కర్నాటక తమిళనాడు సరిహద్దుల నుండి మద్యం సరఫరా కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, బెల్టు షాపులను మూసి వేయించాలని ఎస్‌పిలను ఆదేశించినట్లు చెప్పారు.

ఉప ఎన్నికలకు గాను ముగ్గురు ఐపిఎస్ అధికారులు, 20 మంది ఐఎఎస్ అధికారులను పరిశీలకులుగా నియమించినట్లు ఆయన తెలియచేశారు. ఎన్నికల సమయంలో శాంతి భద్రతల నిర్వహణకు 139 కంపెనీల అదనపు బలగాలను పంపించాలని కేంద్రాన్ని కోరగా ఇప్పటి వరకు 118 కంపెనీలు మంజూరయ్యాయని భన్వర్‌లాల్ తెలియచేశారు.

అంతకు ముందు భన్వర్‌లాల్ ఉప ఎన్నికల విషయమై రాజకీయ పార్టీలతో అఖిల పక్ష

సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్, టిడిపి, టిఆర్ఎస్, బిజెపి, లోక్‌సత్తా , వామపక్షాల ప్రతినిధులు హాజరయ్యారు.

..........................................................

సాక్షి వార్తా పత్రికకు ప్రభుత్వ ప్రకటనల జారీని నిలిపవేస్తూ జారీ అయిన జి.ఓను నిలిపివేస్తూ హైకోర్టు ఈ రోజు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.
ఇందుకు సంబంధించి జూన్ 16వ తేదీలోగా కౌంటర్ పిటీషన్‌ను దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.
సిబిఐ సాక్షి పత్రిక బ్యాంకు అకౌంట్లను స్థంబింపజేసిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రకటనల జారీని నిలిపివేయాలని సమాచార శాఖను ఆదేశిస్తూ ప్రభుత్వం జిఒ నెంబర్ 2097ను జారీ చేసింది.
కాగా ఈ జి.ఓను సాక్షి పత్రిక హైకోర్టులో సవాలు చేసి దాన్ని ఉపసంహరింపజేయాలని కోరింది.
ఇది ఇలా ఉండగా సాక్షి బ్యాంకు ఖాతాలను సిబిఐ నిలిపి వేయడాన్ని సవాలు చేస్తూ సాక్షి గ్రూపు దాఖలు చేసిన పిటీషన్ విచారణను హైకోర్టు ఈ నెల 22కు వాయిదా వేసింది.

..........................................................

కడప ఎంపి జగన్‌మోహన్ రెడ్డి ఆస్తుల కేసు విషయంలో సిబిఐ దాఖలు చేసిన తొలి చార్జిషీట్‌లోని పత్రాలను పొందేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌కు హైదరాబాదులోని సిబిఐ ప్రత్యేక కోర్టు అనుమతిచ్చింది.
ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం కింద ఇడి జగన్‌పై కేసును నమోదు చేసింది. అంతే కాకుండా జగన్ ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడుల్లో విదేశీ మారకం నిబంధనలను అతిక్రమించారన్న అంశంపై కూడా ఇడి దర్యాప్తు జరుపుతోంది.

..........................................................

కడప ఎంపి జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తుల కేసులో రెండు రోజుల క్రితం అరెస్టయిన నిమ్మగడ్డ ప్రసాద్, బ్రహ్మానందరెడ్డిని తమ కస్టడీకి అప్పగించాలన్న సిబిఐ పిటీషన్‌పై ఈ రోజు సిబిఐ కోర్టులో వాదనలు జరిగాయి. నిందితులిద్దరు నిధులను జగన్ కంపెనీల్లోకి మళ్లించి అందుకు ప్రతిగా ప్రయోజనాలు పొందారని సిబిఐ న్యాయవాదులు వాదించారు.
వాన్‌పిక్ ఒప్పందం మూలంగా రాష్ట్రాన్ని ఎటువంటి నష్టం వాటిల్లలేదని అంతే కాకుండా తమ క్లయింట్‌ను సిబిఐ ఇందుకు సంబంధించి 13 సార్లు ప్రశ్నించిందని నిమ్మగడ్డ ప్రసాద్ తరపు న్యాయవాది వాదించారు.

..........................................................

గుంటూరు, పశ్చిమగోదావరి, ఆదిలాబాద్, నిజమాబాద్, కరీంనగర్ జిల్లాలో ఉష్ణోగ్రత గణనీయంగా పెరిగింది. క్రిష్ణా, గుంటూరు జిల్లాలో గత రెండు రోజుల్లో ఉష్ణోగ్రత 5 నుండి 6 డిగ్రీలు పెరిగినట్లు విశాఖ తుఫాను హెచ్చరిక కేంద్రం తెలిపింది.
రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ముఖ్యంగా దక్షిణ కోస్తా ప్రాంతంలో వడగాడ్పులు మరో రెండు రోజుల పాటు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. రెంట చింతల రామగుండంలో 45 డిగ్రీలు, నిజామాబాద్‌లో 44 డిగ్రీలు, బాపట్ల, మచిలీపట్నం, ఒంగోలు, నల్గొండలలో 43 డిగ్రీలు, తిరుపతి, కాకినాడ, భద్రాచలం, నర్సాపూర్, నెల్లూరులలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.

కాగా విశాఖపట్నంలో కొంత తక్కువగా 24 డిగ్రీల సెల్సియస్ నమోదయింది.

.....................................................

రాష్ట్రంలో ఉప ఎన్నికలుజరుగుతుకున జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు ఈ రోజు విస్తృతంగా ప్రచారం సాగించారు.
ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, కేంద్ర మంత్రి వాయలార్ రవి ఈ రోజు కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సాయంత్రం వారు అనంతపురం జిల్లా రాయదుర్గంలో ఎన్నికల సభలో పాల్గొంటారు.
కాగా టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లాలోని నారాయణరెడ్డి పేట, ముల్లుముడిల్లో రోడ్‌షోలు జరిపారు.
కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు చిరంజీవి నెల్లూరు జిల్లా కావలి ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి  వైఎస్ఆర్ కడప జిల్లా రైల్వే కోడూరులోని పెనగలూరులో రోడ్‌షో నిర్వహించారు.

.....................................................

ఎంబిఎలో ప్రవేశానికి గాను నిర్వహించే ఐసెట్ పరీక్ష రాష్ట్రంలోని 250 కేంద్రాల్లో రేపు జరుగుతోంది.
కాకతీయ విశ్వవిద్యాలయం నేతృత్వంలో జరిగే ఈ ఐసెట్ పరీక్షకు సుమూరు 1.37 లక్షల మంది హాజరవుతారు.
ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్షా హాలులోకి అనుమతించమని ఐసెట్ కన్వీనర్ ఓంప్రకాష్ స్పష్టం చేశారు.

.................................................

ఐఐటి ప్రవేశ పరీక్షా ఫలితాలు రేపు వెలువడతాయి. ఏప్రిల్ 8వ తేదీన జరిగిన టిఐ ప్రవేశ పరీక్షను దేశం మొత్తం మీద 5.27 లక్షల మంది హాజరు కాగా మన రాష్ట్రం నుండి 55 వేల మంది హాజరయ్యారు.

.................................................

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు  పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మాజీ మంత్రి కాంగ్రెస్ నాయకుడు జీవన్‌రెడ్డికి పిసిసి నోటీసులు జారీ చేసింది.
ఈ నెల 25వ తేదీన తన ముందు హాజరు కావల్సిందిగా పిసిసి దర్యాప్తు కమిటీ ఆ నోటీసులో జీవన్‌రెడ్డిని కోరింది.

...................................................

మెదక్ జిల్లా పోలీసులు కంగిటి మండలంలోని బాబాబు తాండాపై ఆకస్మిక దాడులు జరిపి రెండు క్వింటాళ్ల గంజాయి, క్వింటాల్ గంజాయి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.
పోలీసు బృందాలు ఆరు ఇళ్లపై దాడులు నిర్వహించి సుమారు 15 లక్షల విలువ చేసే ఈ గంజాయి ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు.

.................................................

ప్రపంచ జూనియర్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు హైదరాబాదులో డిసెంబర్‌లో

జరుగుతాయి.
ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో డిసెంబర్ 9 నుండి 16వ తేదీ వరకు జరుగుతాయి. 19 దేశాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని అంచనా.
జాతీయ, రాష్ట్ర టేబుల్ టెన్నిస్ ఫెడరేషన్లు ఈ పోటీలను సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

..................................................

ఎయిర్ ఇండియాకు చెందిన గుర్తింపు పొందిన కార్మిక సంఘాలతో పౌర విమానాయాన మంత్రిత్వ శాఖ వచ్చే వారం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసింది.
ప్రమోషన్స్ తో సహా వృత్తికి సంబంధించిన అంశాలను చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు పౌర విమానయాన శాఖ మంత్రి అజిత్‌సింగ్ ఈ రోజు న్యూఢిల్లీలో విలేఖరులకు తెలిపారు.
ఇది ఇలా ఉండగా ఎయిర్ ఇండియా సిబ్బంది సమ్మె నేడు 10వ రోజుకు చేరుకుంది. సమ్మె కారణంగా అనేక జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి.

..................................................

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ అనురాగ్ శర్మ జంటనగరాల్లో ఈ నెల 18వ తేదీ నుండి 24వ తేదీ వరకు నిషేధాజ్ఞలను విధించారు.
ఈ కాలంలో పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించరాదు.

..................................................................................................................................